ప్రాణాలు తీస్తున్న అతి వేగం

- పెరిగిన రోడ్డు ప్రమాదాలు
- హెల్మెట్, సీట్ బెల్టు వాడకంపై అవగాహన కల్పించని పోలీసులు


కడప రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన దృశ్యం (ఫైల్)

తాడిపత్రి రూరల్: మొన్న తాడిపత్రి మండలం అర్జాస్ స్టీల్ ప్లాంట్ వద్ద రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు అక్బర్, జాకీర్ చనిపోగా నిన్న చుక్కలూరు వద్ద అదుపుతప్పి రాజు అనే వ్యక్తికి తీవ్ర గాయలాయ్యాయి. ఇలా తాడిపత్రి నియోజకవర్గంలో నిత్యం ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయి. ఎక్కువగా దిచక్ర వాహనాలపై వెళుతున్నా వారే ప్రమాదాలకు గురవుతున్నారు. తాడిపత్రి– కడప రోడ్డులో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. తాడిపత్రి మండల సరిహద్దుగా వైఎస్సార్ జిల్లా ఉంది. ఈ రోడ్డులో అర్జాస్ స్టీల్ ప్లాంట్ వుంది. స్టీల్ ప్లాంట్‌లో వందల సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. గతంలో ప్లాంట్ సమీపంలో కూడా అనేక ప్రమాదాలు జరిగాయి. నిత్యం వందలాది లారీలు, ఇతర కార్లు, వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వివిధ పనుల మీద ద్విచక్ర వాహనాల్లో తిరిగే వారు ఎక్కువగా ఉంటున్నారు.ఈ రోడ్డు ప్రమాదాల జోన్‌గా మారుతోంది.

తాడిపత్రి–బుగ్గ రహదారి అంటే హడల్

తాడిపత్రి– బుగ్గ రహదారి ప్రమాదాలకు చిరునామాగా మారుతోంది. రోజూ వందల సంఖ్యలో ప్రజలు ద్విచక్ర వాహనాలపై రాకపోకలు కొనసాగిస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో గ్రానైట్, కడప స్లాబ్ యునిట్లున్నాయి. వాటిలో వేల సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరూ సమీపంలోని తాడిపత్రిలో నివాసం ఉంటున్నారు. రోజూ ఉదయం ద్విచక్ర వాహనాల్లో విధులకు వెళ్లి రాత్రికి తిరిగి వస్తుంటారు. అల్ట్రాటెక్, పెన్నా,సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు కూడా తాడిపత్రిలో నివాసం ఉంటూ ద్విచక్ర వాహనాల్లో పనులకు వెళ్తుంటారు. అలాగే తాడిపత్రికి సరిహద్దుగా నంద్యాల జిల్లావాసులు వివిధ పనుల కోసం రోజూ అధికసంఖ్యలో ప్రజలు ద్విచక్రవాహనాల్లో తాడిపత్రికి వస్తుంటారు. నంద్యాల జిల్లాలో కడప స్లాబ్ గనులుండటంతో పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లు కెపాసిటీకి మించి బండలు, రాళ్లను అతివేగంగా తీసుకువస్తూ అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ ప్రమాదాల్లో ఎక్కువ మంది ద్విచక్ర వాహనాదారులు గాయపడుతున్నారు.

ఎన్‌హెచ్ 44లో పెరుగుతున్న ప్రమాదాలు

తాడిపత్రి నియోజక వర్గంలోని పెద్దవడుగూరు మండలంలో నేషనల్ హైవే (ఎన్‌హెచ్)44 ఉంది. హైదరాబాద్– బెంగళూరు హైవే కావడంతో రోజూ వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. హైవేకు ఇరువైపులా అనేక గ్రామాలున్నాయి. పలు మండలాలు హైవేలో కలుస్తున్నాయి. దీంతో హైవేలో ద్విచక్ర వాహనాల సంఖ్య కూడా అధికంగా ఉంటోంది. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగులుగా పనిచేస్తున్నా వారు హైవేపై ద్విచక్రవాహనాల్లో రాకపోకలు కొనసాగిస్తుంటారు. అసలే హైవే ఆపై వేల సంఖ్యలో భారీ వాహనాలతో పాటు ఇతర బస్సులు, లారీలు, గూడ్స్ వాహనాలు, కార్లు తదితర వాహనాలు దూర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ప్రయాణ బడలిక, నిద్రమత్తు, తదితర కారణాలతో వాహనాలు నడిపే వారు కునుకు తీస్తుంటారు. ఇలాంటి సమయాల్లో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతాయి. భారీ వాహనాలను ఓవర్‌టేక్ చేసే సమయంలో సైతం అదుపు తప్పి రోడ్లుపై పడుతూ తలలు పగిలి మరణించిన వారున్నారు.

ప్రమాద కేంద్రంగా వేములపాడు క్రాసింగ్

యాడికి మండలంలో ఎక్కువ ద్విచక్ర ప్రమాదాలు జరిగిన ప్రదేశం వేములపాడు క్రాసింగ్. ఇక్కడ ఎక్కువ సంఖ్యలో ద్విచక్ర వాహనదాలు చనిపోయారు. వీరిలో హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారే అధికంగా ఉన్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు క్రాస్‌గా ఉండడంతోపాటు అధ్వానంగా మారింది. వేగంగా వచ్చే వాహనాలు నియంత్రణ కోల్పోయి బోల్తా పడుతున్నాయి. ఈ ప్రమాదాల్లో కొందరు చనిపోగా మిగిలిన వారు క్షతగాత్రులవుతున్నారు. రోడ్డు మలుపును తగ్గించే చర్యలు అధికారులు తీసుకోకపోవడంతో మరిన్ని ప్రమాదాలకు కారణమవుతున్నారు.

ఉదాసీనంగా వ్యవహరిస్తున్న పోలీసులు

పోలీసులు సైతం హెల్మెట్ ధరించకుండా కళ్ల ముందు వాహనాల్లో తిరుగుతున్న వారిని చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. పోలీసుల ఉదాసీనత వైఖరి కారణంగా వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ప్రాణాపాయం కొని తెచ్చుకుంటున్నారు. ద్విచక్ర వాహనాలను నడిపే వారిలో ఎక్కువ మంది హెల్మెట్ ధరించడం లేదు. గతంలో తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలంటూ పోలీసు స్టేషన్లలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. అప్పట్లో వాహనదారుల చేత హెల్మెట్లు కూడా కొనుగోలు చేయించేవారు. హెల్మెట్లు ధరించని వారిపై జరిమానాలు విధించేవారు. కానీ కొంతకాలంగా హెల్మెట్లు ధరించని వారి గురించి పోలీసులు చర్యలు తీసుకోవడం మానివేశారు.

హెల్మెట్ లేకుండా డ్రైవింగ్

తాడిపత్రి పట్టణ, పరిసర ప్రాంతాల్లో వేల సంఖ్యలో ప్రజలు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడుపున్నారు. మైనర్లు సైతం కెపాసిటీకి మించిన వాహనాలను నడుపుతూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. పట్టణంలోని ప్రధాన సీబీరోడ్డు అధ్వానంగా తయారైంది. పలుచోట్ల గుంతలు పడ్డాయి. కొన్ని చోట్ల రోడ్డు హెచ్చు తగ్గులుగా ఉంది. దీనివల్ల ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. కొన్ని సమయాల్లో చిన్న చిన్న గాయాలవుతుండగా మరికొన్ని సార్లు పెద్ద గాయాలతో చనిపోతున్నారు.

క్లుప్తంగా

పోలీస్ ఔట్‌పోస్ట్‌ను తెరిపించండి


డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద మూతపడిన పోలీస్ ఔట్‌పోస్ట్‌ను పునఃప్రారంభించాలని డీఎస్పీ శివభాస్కర్ రెడ్డిని బీజేపీ నాయకులు కోరారు. గురువారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, నాయకులు విజయలక్ష్మి, మహేష్ తదితరులు డీఎస్పీని కలసి వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ఆస్పత్రి వద్ద తరచూ నిరసనలు, చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయని, తద్వారా వైద్యులు, సిబ్బందితో పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. పోలీస్ ఔట్‌పోస్ట్‌ను తెరిపించి పోలీస్ సిబ్బందిని నియమించాలని కోరారు.

పచ్చదనం పెంపునకు కృషి


మొక్క నాటుతున్న ఎంపీడీఓ కవిత, సచివాలయ సిబ్బంది

పెద్దపప్పూరు: పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ కవిత సూచించారు. గురువారం మండలంలోని జూటూరు గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అర్జీల రూపంలో వచ్చిన సమస్యలను త్వరిగతిన పరిష్కరించాలన్నారు.అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో మొక్కలు విరివిగా నాటాలని ఆమె సూచించారు.

బీసీ బాలుర హాస్టల్ తనిఖీ


హాస్టల్లో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి

గుత్తి: పట్టణంలోని కోట వీదిలో ఉన్న బీసీ బాలుర హాస్టల్‌ను గురువారం గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్‌లోని అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. హాస్టల్ అంతా కలియ తిరిగారు. అన్ని గదులను పరిశీలించారు. హాస్టల్లో మౌలిక వసతులు, సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతి, సీడీపీఓ ఢిల్లీశ్వరి, సూపర్‌వైజర్ నాగేశ్వరి, వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఏఈ హరిత

పుట్లూరు: మండలంలోని చింతకుంట గ్రామంలో కాలభైరవస్వామి ఆలయ నిర్మాణ పనులను గురువారం దేవదాయ శాఖ ఏఈ హరిత పరిశీలించారు. రూ.కోటి వ్యయంతో ఆలయాన్ని నిర్మిస్తుండగా ప్రస్తుతం పునాది పనులు జరుగుతున్నాయి. నిర్మాణం నాణ్యతగా చేపట్టాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

పామిడి: మండలాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. గురువారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సమీక్షించారు. పార్టీ కోసం పనిచేసిన వారికి తప్పక ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనంతరం రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్ల మార్పుపై చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, నాయకులు ఆర్‌ఆర్ రమేష్, పత్తి హిమబిందు దాసరి లక్ష్మీకాంతమ్మ, బీ శ్రీనివాసులురెడ్డి, జింకల సంజీవకుమార్, ముసలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యుడు బీ వెంకటరమణ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.

మిరప సాగుకు డిజిటల్ గ్రీన్ సంస్థ సహకారం


మాట్లాడుతున్న హెచ్‌ఓ మిత్రవింద మాధవి

గుత్తి రూరల్: మిరప పంటలు సాగు చేసే రైతులకు డిజిటల్ గ్రీన్ ఎన్‌జీఓ సంస్థ సహకారం అందిస్తుందని ఉద్యాన అధికారిణి మిత్రవింద మాధవి, సంస్థ ప్రతినిధి యశోధ తెలిపారు. పట్టణంలోని డ్వామా కార్యాలయంలో ఉన్న సీఎల్‌ఆర్‌సీ భవనంలో గురువారం డిజిటల్ గ్రీన్ సంస్థ, గుత్తి డివిజన్ పరిధిలోని ఆర్‌బీకే సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిరప పంటలు సాగు చేసిన రైతులకు ఐవీఆర్‌ఎస్ ద్వారా సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. అలాగే వాట్సాప్ గ్రూప్‌లో చాట్..బాట్, వీడియోల ద్వారా రైతుల సమస్యలను ఆర్‌బీకే సిబ్బంది ద్వారా పరిష్కారం చూపుతామన్నారు. తద్వారా పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి నాణ్యమైన పంట దిగుబడి సాధించవచ్చన్నారు. ఇంటిగ్రేటెడ్ న్యూట్రింట్స్ మేనేజ్‌మెంట్ ప్రొటోకాల్ పాటిస్తే రైతులకు క్వింటాల్‌కు రూ.1.500 నుంచి రూ.2,000 వరకూ అదనంగా ఆదాయం లభిస్తుందన్నారు. అనంతరం హెచ్‌ఓ 2024–25 సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలను ఆర్‌బీకే సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు మానస, అజయ్, వీహెచ్‌ఏ గౌసియా, ఎంపీఈఓ షారోన్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓగా కాశెప్ప

పెద్దపప్పూరు: ఇన్‌చార్జి ఎంఈఓగా కాశెప్ప గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంఈఓ శ్రీదేవి మెడికల్ లీవ్‌పై వెళ్లారు. అధికారుల ఉత్వర్వుల మేరకు యాడికి మండలంలో పనిచేస్తున్న ఆయన ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకున్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి


తాడిపత్రిలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


గుంతకల్లులో అల్లూరి జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని


పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట అంగన్‌వాడీ కేంద్రంలో అల్లూరి వేషధారణలో చిన్నారులు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ఆస్పత్రి పాలెం సెక్టార్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అల్లూరి చేసిన ఉద్యమాల గురించి వివరించారు. భారతమాత ముద్దు బిడ్డగా చరిత్రలో గర్వించదగ్గ స్థాయికి ఎదిగి, బ్రిటీష్ వారి తూటాలకు నేలరాలిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు వేషధారణలో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గుంతకల్లుటౌన్: బ్రిటీషర్ల దాష్టీకాల నుంచి గిరిజనులను కాపాడిన స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు అని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి చేర్‌పర్సన్‌తోపాటు కమిషనర్ వెంకటరమణయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈ గురప్పయాదవ్, ఆర్‌ఓ నాసిర్‌హుసేన్, కౌన్సిలర్ విద్యారాణి, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం పెద్దపప్పూరు, ముచ్చుకోట అంగన్‌వాడీ సెంటర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు అల్లూరు వేషధారణల్లో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పెద్దపప్పూరు, ముచ్చుకోట సూపర్‌వైజర్లు రామలక్ష్మి, నారాయణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు రంగం కళావతి, పద్మావతి, హనుమక్క, ఎ.పద్మావతి, రామలక్ష్మి, జైన్‌బీ తదితరులు పాల్గొన్నారు.


పుట్లూరు గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

విద్యాసంస్థల బంద్ విజయవంతం


తాడిపత్రి ప్రభుత్వ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు


శింగనమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు


గుత్తిలో రాస్తారోకో చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

తాడిపత్రిటౌన్: ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పట్టణంలోని జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ , ఎస్‌ఎస్‌ఎస్ పాఠశాలలను బంద్ చేయించగా మిగిలిన ప్రవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి. ఏఐఎస్‌ఎఫ్ తాడిపత్రి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నరసింహయాదవ్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. నీట్ స్కాంపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు ఖరీమ్, వినోద్, రాకేష్, పవన్, ఓబులేసు, మహేష్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: ఎస్‌ఎఫ్‌ఐ పిలుపు మేరకు శింగనమలలో విద్యా సంస్థలు గురువారం బంద్ చేశాయి. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్య ప్రకాష్, నాయకులు సాయి, విష్ణు, గౌతమ్, బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: నీట్ పరీక్షలో అవకతవకలపై భారత్ బంద్‌లో భాగంగా గురువారం ఎమ్మార్పీఎస్, సీపీఐ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను బంద్ చేయించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఆదినారాయణ, మండల అధ్యక్షుడు కంబగిరి, సీపీఐ నాయకుడు చింతా పురుషోత్తం పాల్గొన్నారు.

గుత్తి: గుత్తిలో గురువారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. గుత్తిలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట నాయక్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, సభ్యులు గుత్తి, గుత్తి ఆర్‌ఎస్ కలియ తిరిగి అక్కడక్కడా తెరిచి ఉంచిన కాలేజీలు, పాఠశాలలను బంద్ చేయించారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నా యకులు బాలాజీ, కృష్ణ, ఈశ్వర్, గురు, ధన, విజయ్,కిరణ్, ధనుష్, ఇస్మాయిల్, షేక్షావలి, సునీల్, మంజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలో గురువారం విద్యార్థి సంఘం నాయకులు చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నీట్ పరీక్షను రద్దు చేయాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దీంతో మోడల్, జిల్లా పరిషత్ హైస్కూల్ బంద్ చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇళ్లకు వెళ్లారు.

పామిడి: పామిడిలో గురువారం భారత్‌బంద్ పాక్షికంగా జరిగింది. నీట్, నెట్ వంటి ఎంట్రెన్స్ పరీక్షల పేపర్ల లీకేజీని నిరసిస్తూ విద్యార్థి సంఘాల నాయకులు బంద్ తలపెట్టారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి సన్మానం


క్రీడాకారిణి ముస్కాన్‌ను అభినందిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికై న తాడిపత్రికి చెందిన క్రీడాకారిణి ముస్కాన్‌ను గురువారం స్థానిక బీజేపీ నాయకులు సన్మానించారు. బీజేపీ రాష్ట లీగల్ సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి నివాసంలో కర్నూలు జిల్లా ఇన్‌చార్జి అంకాల్‌రెడ్డి తదితరులు క్రీడాకారిణితోపాటు కోచ్ రవికుమార్‌ను అభినందించి పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి మరిన్ని విజయాలు సాధించి తాడిపత్రికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రంగనాథరెడ్డి, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు, ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి బాల కంబగిరి, మహిళ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు అమరవాణి, పట్టణ ప్రధాన కార్యదర్శి కృష్ణమోహన్, చేనేత జిల్లా కన్వీనర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఇబ్బందులు కలిగించొద్దు


కేజీబీవీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప

పెద్దవడుగూరు: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే సహించబోమని ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ఈవిటీజింగ్ లాంటి చర్యలకు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం ఫ్యాక్షన్ గ్రామాలైన అప్పేచర్ల, చిన్నవడుగూరు, దిమ్మగుడిలో ఎస్‌ఐ పర్యటించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దని ఆయా గ్రామస్తులకు సూచించారు. పాత కేసుల్లోని నేరస్తుల కదిలికలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు


తండ్రి శివశంకర్, కూతురు ప్రశాంతి

పుట్లూరు: మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన శివశంకర్, ఆయన కూతురు ప్రశాంతి కనిపించలేదనే ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. శివశంకర్ గత నెల 20న భార్య స్వాతితో గొడవ పడి 11 ఏళ్ల కుమార్తె ప్రశాంతిని తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. స్వాతి బంధువుల సహాయంతో పలు చోట్ల గాలించినా వారు కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై మిస్సింగ్ కేసును నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు.

జడ్చర్ల వద్ద రోడ్డు ప్రమాదం.. కండ్లపల్లివాసి దుర్మరణం


పి.రమేష్ (ఫైల్)

పామిడి: తెలంగాణ రాష్ట్రంలోని జడ్చర్ల వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కండ్లపల్లి గ్రామవాసి, డ్రైవర్ పీ రమేష్(25) దుర్మరణం చెందాడు. బొలెరో వాహనానికి ఆయన డ్రైవర్‌గా వెళ్లాడు. జడ్చర్ల వద్దకు వచ్చేసరికి వాహనం ఆగిపోయింది. దీంతో వాహనం మరమ్మతు కోసం అతడు కిందకు దిగి పరిశీలిస్తుండగా ఓ గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీ కొని వెళ్లింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య వసంత, కుమారుడు, కుమార్తె సంతానం. దీంతో కండ్లపల్లి గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహకాలు


చుక్కలూరులో విద్యార్థినికి నగదు అందజేస్తున్న పెన్షనర్ల సంఘం సభ్యులు

తాడిపత్రి రూరల్ : మండలంలోని బ్రహ్మణపల్లి, చుక్కలూరు హైస్కూళ్లల్లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనపరచిన వారికి గురువారం వేర్వేరుగా తాడిపత్రి పెన్షన్ల సంఘం సభ్యులు బహుమతులను ప్రదానం చేశారు. బ్రహ్మణపల్లిలో విద్యార్థులు కుమారి, భార్గవి, అక్షయలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున నగదును అందచేశారు. అలాగే చుక్కలూరులో విద్యార్థులు శివగౌరి, క్రిష్ణవంశి, జాహ్నవికి నగదు బహుమతులందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, పెన్షనర్లు ఆదినారాణస్వామి, వీరారెడ్డి, హనుమంతరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నరసింహులు, రమణరాజు, భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోండి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తరిమెల పీహెచ్‌సీ వైద్యాధికారి శంకర్‌నాయక్

శింగనమల/గార్లదిన్నె: డయేరియా, మలేరియా, డెంగీ తదితర విష జ్వరాలు ప్రబలకుండా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని తరిమెల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్. శంకర్‌నాయక్ సూచించారు. గురువారం శింగనమల మండలంలోని సి.బండమీదపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శోభ, హెల్త్ సూపర్‌వైజర్లు ఆశ్వర్థ, హెల్త్ ప్రొవైడర్ అప్సర భాను, ఏఎన్‌ఎం హేమలత, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె మండలంలోని పలు గ్రామాల్లో డయేరియా ఇంటింటా సర్వే చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గౌతమి మాట్లాడుతూ డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

యర్రగుంట్ల నల్లమ్మ ఆలయంలో చోరీ


నల్లమ్మ దేవాలయం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో ఉన్న నల్లమ్మ ఆలయంలో గురువారం చోరీ జరిగినట్లు ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. బుధవారం రాత్రి అర్చకులు స్వామికి పూజలు చేసి గుడికి తాళాలు వేసుకుని ఇంటికెళ్లారు. గురువారం ఉదయం ఆలయం వద్దకు అర్చకులు వెళ్లగా.. గుడి తలుపులు తెరచి ఉండడంతో వెంటనే చుట్టు ప్రక్కల వారికి సమాచారం అందించారు. గుర్తు తెలియని దుండగులు గుడి తాళం కట్ చేసి లోపలికి ప్రవేశించి, గుడిలో ఉన్న రెండు హుండీలను పగలగొట్టి అందులో ఉన్న దాదాపు రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లారు. హుండీలను గుడి సమీపంలో ముళ్ల కంపల్లో వదిలేసి వెళ్లారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలం వద్దకు వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. చోరీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.